సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం। 22। ఏప్రిల్। 2025



కన్ను పడితే కబ్జా చేయాల్సిందే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది లోనే రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఇక్కడి ద్వితీయ శ్రేణి నాయకుల భూ కబ్జాలకు అంతు లేకుండా పోతోంది. - 8లో



విద్యుత్ కనెక్షన్ తీసుకోవద్దన్నందుకు దాడి

విద్యుత్ మోటార్ నుంచి విద్యుత్ కనెక్షన్ తీసు కోరాదని వారించినవారిపై ప్రభాకర్ అనే వ్యక్తి కొడవలితో దాడి చేసి గాయపరిచాడు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 410 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

బాధితులకు న్యాయం చేయాలి



ప్రజల సమస్యలు వింటున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం వెంకటాద్రి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని, బాధిలకు న్యాయం చేయాలని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో, సర్కి ల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

వైభవం..పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటిలోని వీరభద్ర స్వామి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి వీరభద్రస్వామి వారి, భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధరకాల పూలతో అందంగా అలంకరించారు. పల్లకీలో కొలువుదీర్చి ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. ఈవో డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులతోపాటు కర్ణాటక భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అభ్యంతరాలను 24 లోపు సమర్పించాలి

– పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శ్యాముల్

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ పరిధిలోని అనంపురం, చిత్తూరు, కడప, కర్నూల్ పూర్వపు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్(గవర్నమెంట్) నుంచి (గ్రేడ్ –2 ప్రధానోపాధ్యాయ పోస్టులకు సవరించడానికి తాత్కాలిక జాబితాను htppr://rjdrekadapa.bofrpot.comలో ఉంచినట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శ్యాముల్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో తగిన ఆధారాలతో ఈ నెల 24వ తేదీలోల సమర్పించాలని సూచించారు.

పదోన్నతి కౌన్సెలింగ్ ప్రశాంతం

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో సోమవారం స్టాఫ్ నర్స్ నుంచి హెడ్ నర్సులుగా చేపట్టిన పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 15 మందికి గాను 9 మంది పదోన్నతులు పొందారు. నిబంధనల ప్రకారం ప్రమోషన్ల కౌన్సెలింగ్ ను చేపట్టినట్లు ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ డీఐఈఓగా సత్యనారాయణరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : డిస్ట్రిక్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీఐఈఓ)గా సత్యనారాయణరెడ్డిని నియమిస్తూ విద్యాశాఖ సెక్రటరీ కొన శశిదర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌టీఆర్ జిల్లా పయాకపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఈయన్ను వైఎస్సార్‌జిల్లా డీఐఈఓగా నియమించారు. గతంలో డీఈఓగా పనిచేస్తున్న శ్రీనివాసుల రెడ్డి ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో కడప ఆర్‌ఐవోగా పనిచేస్తున్న బండి వెంకటసుబ్బయ్యకు డీఈఓను బాధ్యతలను అప్పగించారు. కాగా సత్యనారాయణరెడ్డి నూతన డీఐఈఓగా రెండు రోజుల్లో బాధ్యతలను చేపట్టనున్నారు.

ఇంటర్ ఆర్‌జేడీగా శ్రీనివాసులు...

ఇంటర్మీడియట్ ఎఫ్‌ఏసీ ఆర్‌జేడీగా శ్రీనివాసులును ప్రభుత్వం నియమించింది. ఈయన ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా డీకే గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తుండగా ఆయనను చిత్తూరు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా నియమించారు. చిత్తూరు డీఐఈఓగా నియమించిన శ్రీనివాసులను ఎఫ్‌ఏసీ ఆర్‌జేడీగా కడపకు నియమించారు. ప్రస్తుతం కడప ఆర్‌జేడీగా పనిచేస్తున్న రవిని రాయచోటి డీఐఈఓగా నియమించారు.

ఆపుకోలేని ఆవేదనకు బ్రేక్!

- లోకోపైలట్లను కరుణించిన రైల్వేశాఖ
- రైలింజన్‌లోనే యూరినల్స్, ఏసీ, ఎర్గోనామిక్ సీట్లు
- తొలుత గూడ్స్ రైళ్లలో ఏర్పాటుదిశగా చర్యలు

డివిజన్ : గుంతకల్

లోకోపైలెట్స్ : 2500

రన్నింగ్‌స్టాప్ క్రూసెంటర్ : తిరుపతి, రేణిగుంట, నందలూరు, ఎర్రగుంట్ల, గుత్తి, గుంతకల్లు.





లోకోపైలట్స్ (ఇన్‌సెట్) యూరినల్స్ కోసం లోకోమోటివ్‌లో ఏర్పాటుచేసిన టాయిలెట్

రాజంపేట : ఆపుకోలేని ఆవేదనకు రైల్వేశాఖ బ్రేక్ వేసింది..ఇదేంటబ్బా అనుకోవచ్చు.. విధి నిర్వహణలో రైలింజన్ నడిపే లోకోపైలెట్స్, అసిస్టెంట్ లోకోపైలట్స్ యూరినల్స్ తదితర సమస్యలు ఉత్పన్నమైతే ఇబ్బందులు పడాల్సి వచ్చేది. లోకోపైలట్స్ ఒక్కోసారి నీళ్లు తాగటానికి ఒకటికి నాలుగు సార్లు ఆలోచించే పరిస్థితి..మూత్ర విసర్జనకు వెళ్లాంటే రైలు ఆగే స్టేషన్ రాకకోసం ఎదురుచూడాల్సిందే. అందుకు ఒక్కోసారి ఐదారు గంటలు కూడా పట్టొచ్చు.. మహిళాలోకోపైలట్లు చాలా అవస్థలు పడేవారు.ఈ సమస్యను పరిష్కరించాలని ఇంతకాలానికి రైల్వేశాఖ ముందడుగు వేసింది. రైలింజన్ క్యాబిన్‌లో యూరినల్స్, ఏసీవసతి, ఆధునిక ఎర్గోనామిక్ సీట్ల ఏర్పాట్లను తప్పనిసరి చేసింది. దీంతో ఎల్‌పీ,ఎల్‌పీలకు పెద్ద ఉపశమనం లభించనుంది.రైల్వేశాఖ నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- కొత్తగా తయారుచేసే అన్ని లోకో క్యాబిన్లలో యూరినల్స్, ఏసీ, ఎర్గోనామిక్‌సీట్లు ఏర్పాటు కోసం వాటి డిజైన్లను రైల్వేశాఖ మార్చింది. ఇప్పటికే వినియోగిస్తున్న లోకోమోటివ్‌లలో వాటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. గుత్తి, విజయవాడ, లాలాగూడా, మౌలాలి, లోకోషెడ్లను ఈ పనులు ప్రారంభించారు. తొలుత గూడ్స్‌రైళ్లలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 42 లోకోమోటివ్ లలో ఏర్పాటుచేశారు. ఇంజిన్‌ను పరిశీలించేందుకు వీలుగా అన్ని కారిడార్ చిన్న క్యాబిన్ ఏర్పాటుచేసి ,అందులో యూరినల్స్ కమోడ్ ఏర్పాటుచేస్తున్నారు. లోకోమోటివ్‌లో నీటి వసతి ఉండదు. కాబట్టి టాయిలెట్ కాకుండా యూరినల్స్ వసతి మాత్రమే ఏర్పాటుచేస్తున్నారు.

క్లీనింగ్ ప్రశ్నార్థకరం..

సాధారణ కోచ్ నాలుగురోజులకొకసారి స్పెషల్ క్లీనింగ్‌కు షెడ్డుకు వెళుతుంది. అప్పుడు అందులోని మానవ వ్యర్థాలను తొలగిస్తారు. కానీ లోకోమోటివ్ 90రోజులకొకసారి మాత్రమే షెడ్డుకు వెళుతుంది. అప్పటి వరకు వ్యర్థాలను నిల్వ ఉంచలేరు. లోకోమోటివ్ కంపు కొడుతుందని ఎల్‌పీలు అంటున్నారు. దీంతో క్లీనింగ్ ప్రశ్నార్థకరంగా మారింది.

ఎర్గోనాటిక్ సీట్లు...

గతంలో 90 డిగ్రీల కోణంలో సీట్లు ఉండేవి. ఇవి ఏమాత్రం అనుకూలంగా ఉండేవి కాదు. వీటిల్లో ఎక్కువ గంటలు కూర్చొని పనిచేస్తే నడుము, వెన్నముక నొప్పులొస్తున్నాయనే ఆరోపణలున్నాయి. రైల్వేశాఖకు ఫిర్యాదులు వెళుతున్నాయి. మహిళా సిబ్బంది మరింత ఇబ్బందికి గురవుతున్నారు. ఇప్పుడు వీటి స్థానంలో ఎర్గోనామిక్ సీట్లను ఏర్పాటుచేస్తున్నారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం



దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించింది. రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. యూరినల్స్‌కే పరిమి తం కాకుండా, టాయిలెట్ వసతి కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– సూర్యరావు, లోకోపైలట్, రేణిగుంట

టాయిలెట్ వసతి ఏర్పాటు అవసరం



లోకోమోటివ్స్‌లో యూరినల్స్‌తో టాయిలెట్ వసతి ఏర్పాటు అవసరం ఎంతైనా ఉంది. యూరినల్స్ ఏర్పాటు విషయంలో రైల్వేశాఖ తీసుకున్న నిర్ణయ హర్షణీయం. ఎల్‌పీ,ఎఎల్‌పీలు పడే ఇబ్బందులు తొలుగుతాయి. విధి నిర్వహణలో ఇక ఆపుకోనక్కరలేదు.

– రామకృష్ణ, లోకోపైలట్, నందలూరు

ఇబ్బందులు తొలగుతాయి



విధి నిర్వహణలో మేము పడే ఇబ్బందులను రైల్వేశాఖ అర్థం చేసుకుంది. సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. ఇక ఇబ్బందులు తొలగుతాయి. చాలా సంతోషంగా ఉంది. లోకోమోటివ్‌లో ఏసీ, ఎర్గోనామిక్స్ సీట్ల ఏర్పాటుపై దృష్టి సారించడం అభినందనీయం.

– డీ.సురేష్‌బాబు, లోకోపైలట్, నందలూరు

ఏఐతో నో టెన్షన్

కురబలకోట : ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ), మెషిన్ లర్నింగ్ న్యూ ట్రెండ్‌ను సృష్టిస్తోందని బెంగళూరులోని ఎడుట్యూర్ సీటీఓ వినోద్ అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన జాతీయ సింపోసియంలో ఆయన మాట్లాడుతూ ఏఐ వివిధ రంగాల్లో శరవేగంగా విస్తరిస్తోందన్నారు. ఇది ఎలక్ట్రికల్ రంగానికి బాగా ఉపయోగపడుతోందన్నారు. సమయాన్ని, శ్రమను, వ్యయ ప్రయాసలను తగ్గిస్తోందన్నారు. నాణ్యవంతంగా పనిచేస్తుందని తెలిపారు. విద్యుత్ వినియోగాన్ని విశ్లేషించి డిమాండ్ ప్రకారం పంపిణీ చేస్తుందని చెప్పారు. విద్యుత్ బిల్లులు కూడా తగ్గుతాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు లాంటి పరికరాల్లో సమస్యలు ఎదురవ్వక ముందే గుర్తిస్తుందని వివరించారు. బ్రేక్ డౌన్లు తగ్గుతాయన్నారు. ఆటోమేటిక్ నిర్ణయాలు తీసుకోవడంతో పాటు ఓ లైన్‌లో లోడు పెరిగితే మరో లైన్‌కి లోడ్ షిఫ్ట్ చేయవచ్చని తెలిపారు. సోలార్, విండ్ పవర్, వాటర్ లాంటి అస్థిర విద్యుత్ ఉత్పత్తి వనరులను సమర్థవంతంగా ప్రెడిక్ట్ చేసి గ్రిడ్‌కు బలంగా జత చేయడంలో ఐఈ బాగా ఉపయోగపడుతుందని చెప్పారు. నిపుణత సాధిస్తే కేరీర్ అవకాశాలకు కొదువ లేదన్నారు. ఎలక్ట్రికల్‌తో పాటు వివిధ అనుబంధ రంగాల్లో భారీ స్థాయిలో ఉద్యోగాలు కల్పిస్తున్న ఎలక్ట్రికల్ రంగంలో ఇంకా మెరుగైన పరిశోధనలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు.



జాతీయ సింపోసియంలో జ్యోతి వెలిగిస్తున్న వినోద్

బాధ్యతగా విధులు నిర్వహించాలి

– జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి : పంచాయతీ సెక్రటరీలకు కేటాయించిన 29 రకాల విధులను బాధ్యతగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు.గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారంలోనూ కీలకపాత్ర పోషించాలని అన్నారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని అన్ని మండలాల ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీలతో గ్రామాలు, మండలాల్లో జరుగుతున్న చెత్త సేకరణ, పన్నుల నిర్వహణ, నీటి సరఫరా, గ్రీన్ అంబాసిడర్లు తదితర అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జాతీయ రహదారుల పక్కన చెత్త కనపడకూడదన్నారు. నిధుల సేకరణపై పంచాయతీ సెక్రటరీలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి తదితరులు పాల్గొన్నారు.

ఈ ఫోటోలో కనిపిస్తున్న వారు బి.కొత్తకోట మండలం గట్టు గ్రామం టేకులపెంటలో కాపురముంటున్న యానాదులు. వీరికి 2000 సంవత్సరంలో సర్వే నెంబరు 1218–4లో 1.68 సెంట్ల డీకేటీ భూమిని ప్రభుత్వం కేటాయించింది. అయితే అందుకు సంబంధించిన భూమిని ఆన్‌లైన్ చేయించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలోనూ సమస్యను పరిష్కరించాలని అధికారులకు అర్జీలు సమర్పించారు. ఇంతవరకు ఆన్‌లైన్‌లో చేర్చలేదని....దీంతో 1బీ, అడంగల్ రాక ఇబ్బందులు పడుతున్నామని సబ్ కలెక్టర్‌కు వివరించారు. మాకు వెంటనే ఆన్‌లైన్‌లో ఎక్కించేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.



మదనపల్లె సబ్ కలెక్టర్‌కు ఆన్‌లైన్ సమస్యపై వినతిపత్రం సమర్పిస్తున్న బాధితులు

సన్నగిల్లుతున్న నమ్మకం!

- పదేపదే ఒకే సమస్యపై తిరుగుతున్నా కనిపించని పరిష్కారం
- కూటమి సర్కార్ చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తగ్గిపోతున్న బాధితులు
- 60 నుంచి 70% మేర రెవెన్యూ సమస్యలతోనే కలెక్టరేట్‌కు



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ తదితరులు

సాక్షి రాయచోటి : ఏప్రిల్ నెల అందునా మండు వేసవి. ఉదయం 10 గంటల నుంచే ప్రారంభమయ్యే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండుటెండలో..ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పరుగులు పెడుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో నమ్మకం సన్నగిల్లుతోంది. ఏదో చేస్తారని.. ఏమేమో జరిగిపోతాయని ఎంతో ఆశతో.. కష్టాలు పడుతూ .. కన్నీళ్లు దిగమింగుతూ కలెక్టరేట్ వస్తున్న సమస్యలు పోవడం లేదు..అధికారం అండగా...ఆగడాలు మెండుగా...జిల్లాలో కొనసాగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులకు న్యాయం మాత్రం కొండంత దూరంలో కనిపిస్తోంది.. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ నిర్వహించే అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వచ్చి గోడు వెళ్లబోసుకునేందుకు బారులు తీరుతున్నారు.

న్యాయం కోసం

జిల్లాలోని అటు తంబళ్లపల్లె, ఇటు రైల్వేకోడూరు, మదనపల్లె, రాజంపేట ఇలా చెబుతూపోతే దూర ప్రాంతాల నుంచి ఎన్నో ఆశలతో కలెక్టరేట్‌కు కదులుతున్నారు. కానీ పెన్షన్లు, ఇతరత్రా చిన్నపాటి సమస్యలకు కూడా ఒక్కోసారి పరిష్కారం గగనంగా మారుతోంది. ఎక్కువగా రెవెన్యూకు సంబంధించి ఆన్‌లైన్, అధికార పార్టీ నేతల కబంధ హస్తాల్లో చిక్కుకున్న స్థలాలను విడిపించమని, ఇతరత్రా దాడులు, వాటిపై ఫిర్యాదులు వస్తున్నాయి. దివ్యాంగులు, వృద్ధులు, ఇతర వ్యక్తిగత సమస్యలతో ప్రతి సోమవారం 250–300 మంది వరకు వస్తున్నారు. ప్రధానంగా ఇంటి పట్టా, ఆన్‌లైన్ సమస్యలు, భూ కబ్జాలు, ఉద్యోగాలు, రుణాల కోసం ఇలా అనేక సమస్యలతో కలెక్టరేట్‌కు న్యాయం కోసం వస్తున్నారు.అయితే జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జేసీ ఆదర్శ రాజేంద్రన్ తదితరులు పరిశీలించిన అర్జీల విషయంలో కొంచెం ప్రత్యేక శ్రద్ధ చూపుతుండడంతో కొంతమేర ఫలితం కనిపిస్తోంది. మిగతా వాటికి సంబంధించి ఆయా శాఖల్లో ప్రయోజనం పెద్దగా ఉన్నట్లు లెక్కల్లో గ్రేడ్లు వేసుకుంటున్నా చాలా వరకు సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు వాపోతున్నారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ సొమ్ము అందించాలి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఐ (ఎం ఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ ఆధ్వర్యంలో పలువురు కూలీలు జేసీని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామం గొర్లముది వీడు గ్రామంలో ఉపాధి కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలని వారు కోరారు. అంతేకాకుండా తమకు పనిదినాలు 200 రోజులు కల్పించాలన్నారు అలాగే ఉపాధి కూలీలకు వేసవి నేపథ్యంలో రక్షణ కల్పించాలని జేసీకి వివరించారు.

సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

రాయచోటి : ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సమస్యపై ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందన్నారు. కావున అధికారులు ఫిర్యాదులను నూరుశాతం పరిష్కరించాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ తీసేస్తామంటున్నారు



నాకు రెండు చేతులు పనిచేయడం లేదు. ఎప్పుడో సచ్చుపడిపోయాయి. ఉన్నా లేనట్లే. అయితే ఒక్కోసారి పింఛన్ తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కనెల పింఛన్ తీసుకోకపోవడంతో మేనెల పింఛన్ రాదని గ్రామ సెక్రటరీ చెప్పారు. కలెక్టర్‌కు విన్నవించుకోవాలని వచ్చాను. ఉన్నతాధికారులు న్యాయం చేయాలి. – వెంకట్రాముడు, తవ్వగుంటపల్లె, కేవీ పల్లె మండలం

ఫెయిల్ పరీక్షకే.. జీవితానికి కాదు

- క్షణికావేశానికిలోనై తొందరపాటు చర్యలు వద్దు
- ముందుంది బంగారు భవిష్యత్తు

ఆత్మస్థైర్యం..సాధించాలన్న తపన ఉంటే చాలు...ఎంతటి కష్టాలనైనా ఎదుర్కోవచ్చు. పరీక్షలు..మార్కులు ర్యాంకులే పరమావధి కాదు. తక్కువ మార్కులు వచ్చినా.. ఫెయిలైనా జీవితం ముగిసిపోదు. క్షణికావేశ నిర్ణయాలు మంచిది కాదు. నిరాశ చెందకుండా మరింత ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే విజయం పాదాక్రాంతం అవుతుందని విద్యావేత్తలు, సైకాలజిస్తులు సూచిస్తున్నారు. ఈనెల 23న పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

రాజంపేట టౌన్/మదనపల్లి సిటీ : ఇటీవలే ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు వచ్చాయి. ఆ ఫలితాల్లో ఫెయిల్ అయ్యామన్న బాధతో కొంత మంది, తక్కువ మార్కులు వచ్చాయని మరికొంత మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం చాలా బాధాకరమైన విషయం. ఇక ఏం చేసినా, ఎన్నికోట్లు ఖర్చుపెట్టినా వారి ప్రాణాలు మాత్రం తిరిగిరావు. అంతేకాదు ఆశలన్నీ పిల్లలపైనే పెట్టుకొని బతుకుతున్న తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిల్చారు. వారు 'ఒక్కటంటే ఒక్క నిమిషం' మనసు నిబ్బరంగా చేసుకొని ప్రశాంతంగా ముందున్న భవిష్యత్తు, తల్లిదండ్రుల గురించి ఆలోచించి వుంటే వారు ఆత్మహత్యలు చేసుకునేవారు కాదు.

టెన్త్ విద్యార్థులూ...క్షణికావేశం వద్దు

ఈనెల 23వ తేదీ టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను విడుదల చేసేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. టెన్త్ ఫలితాల్లో ఎవరైనా ఫెయిల్ అయినా,ఎవరికైనా తక్కువ మార్కులు వచ్చినా.. క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విద్యావేత్తలు, మేధావులు చెబుతున్నారు. ఫలితాలు ఎలా ఉన్నా కాసేపు ప్రశాంతంగా ఆలోచించుకొని ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఓటమి విజయానికి తొలిమెట్టులాంటిది. పరీక్షల్లో మనం ఎందుకు తప్పాం, లోపం ఎక్కడుంది అని ఆలోచించి దాని అధిగమిస్తే త్వరలో జరిగే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో తప్పక ఉత్తీర్ణులు కాగలరని విద్యావంతులు చెబుతున్నారు.

చదువులో వెనకబడ్డా..గొప్ప వ్యక్తులయ్యారు

- క్రికెట్ క్రీడాభిమానులు తమ ఆరాధ్యదైవంగా భావించే సచిన్ టెండూల్కర్ టెన్త్ ఫెయిల్ అయ్యారు. అయితేనేం తనకు ఆసక్తి ఉన్న క్రికెట్‌లో రాణించి ప్రపంచ వ్యాప్తంగా కీర్తి గడించారు.
- పాతతరం ప్రజలను, సినీ ప్రేక్షకులను అలరించిన దివంగత అక్కినేని నాగేశ్వరరావు విద్యాభ్యాసం ప్రాథమిక స్థాయిలోనే ఆగిపోయింది. అయితే ఆయన ఏమాత్రం కుంగిపోలేదు. నటనపై ఉన్న ఆసక్తితో చెన్నైకి వెళ్లి గొప్ప నటుడయ్యారు. అంతేకాదు దేశంలోనే మేటిగా ఉన్న అన్నపూర్ణ స్టూడియోను నిర్మించి అనేక మందికి ఉపాధిని కల్పించారు.
- అబ్దుల్‌కలాంకు మార్కులు తక్కువగా వచ్చేవి. కాని చదవడం, నేర్చుకోవడం అంటే ఆయనకు ఎనలేని ఇష్టం. అదే అబ్దుల్ కలాంను శాస్త్రవేత్తను, మనదేశానికి రాష్ట్రపతిని చేసింది. 'భారతరత్న'ను కూడా తెచ్చిపెట్టింది.
- ప్రముఖ గాయని లతా మంగేష్కర్ ఎప్పుడూ స్కూల్‌కు వెళ్లలేదు. అయినా పాటల తోటలో గానకోకిలగా కీర్తి గడించారు.
- శ్రీనివాసరామానుజన్ గొప్ప గణిత మేధావి. కొన్నిసార్లు చదువులో ఇబ్బంది పడినా ఎప్పుడూ నిరాశ చెందకుండా లెక్కల్లో కొత్త విషయాలు తెలుసుకునేవారు. అతని మేథాశక్తిని గుర్తించిన గణిత ఆచార్యుల ద్వారా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో పరిశోధనకు అవకాశం పొందారు.



పరీక్షలు ,మార్కులే జీవితమా అనే అంశంపై మాట్లాడుతున్న మోటివేటర్ రామమూర్తి

ఈ విషయాలు మరువద్దు

- పాస్, ఫెయిల్ అన్నవి అత్యంత సాధారణ విషయాలు. అందువల్ల విద్యార్థులు ఫలితాలు ప్రతికూలంగా ఉన్నా చాలా లైట్‌గా తీసుకోవాలి. ప్రశాంతంగా ఆలోచించాలి. పొరపాటు ఎక్కడ జరిగిందో తెలుసుకుని ముందుకు సాగాలి
- జరిగిన పొరపాటుకు కుంగిపోకుండా ఆత్మస్థైర్యాన్ని నింపుకోవాలి
- ఒత్తిడి నుంచి వేగంగా బయటపడేందుకు ప్రయత్నించాలి.
- వెనకబడిన పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలి. అవసరమైతే ఉపాధ్యాయులు, సీనియర్ల సూచనలు, సలహాలు తీసుకోవాలి.
- ఫలితాలు విడుదలయ్యే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు దగ్గరగా ఉండాలి.వారికి ధైర్యం చెప్పాలి.
- ఫలితాలు ప్రతికూలంగా ఉన్నా తల్లిదండ్రులు ఏమాత్రం కోపగించుకోకుండా పిల్లలతో చిరునవ్వుతో మాట్లాడాలి.

మూభావంగా ఉంటే అప్రమత్తంకండి

- టెన్త్ చదివే విద్యార్థులది కౌమారదశ. అందువల్ల వారి మనస్సు చాలా సున్నితంగా ఉంటుంది. చిన్న సమస్య వచ్చినా తట్టుకోలేరు. ఫలితాలు విడుదలయ్యాక మార్కులు తక్కువ వచ్చినా, ఫెయిల్ అయినా తల్లిదండ్రులు తమ పిల్లలను ఓ కంటకని పెట్టి ఉంచాలి.
- ఆహారం తీసుకోక పోయినా, ఏదో ఆలోచిస్తూ మూభావంగా ఉన్నా వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.
- ఫెయిల్ అయిన వారిని ఒంటరిగా ఉంచకూడదు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉండాలి

పరీక్షల్లో వచ్చే మార్కులు కాదు... పిల్లలను ప్రేమించాలని ప్రముఖ మోటివేటర్ స్పీకర్ డీజీ రామ్మూర్తి అన్నారు. ఇటీవల పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.విద్యార్థుల తల్లిదండ్రుల్లో మార్పులు రావాలని సూచించారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉండాలని తెలిపారు.

పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపాలి



టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు జీవితానికి ఫైనల్ కాదన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలి. వచ్చే నెలలోనే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయి. సప్లిమెంటరీ పరీక్షలకు బాగా ప్రిపేర్ అయ్యి ఉత్తీర్ణత సాధించవచ్చు. ప్రతి ఒక్కరిలోనూ ఒక టాలెంట్ ఉంటుంది. అందువల్ల చదువులో రాణించలేక పోయినా తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి జీవితంలో గొప్ప వ్యక్తిగా ఎదిగేందుకు ప్రయత్నించండి. అంతేకాని ఆత్మహత్యలు చేసుకొని తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చకండి. పిల్లలు ఫెయిలైనా తల్లిదండ్రులు మందలించడం, నిదించడం వంటివి చేయకండి. ఇంతటితో చదువు ఆగిపోదు, పరీక్షలు ఆగిపోవు అన్న ఆత్మస్థైర్యాన్ని తల్లిదండ్రులు పిల్లలకు కల్పించాలి.

– మునగాల కృష్ణకుమార్, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ, రాజంపేట

ధ్రువపత్రాలు కేవలం అర్హతకే...!



ప్రపంచ కుబేరుల్లో ఎక్కువ మంది పెద్ద చదువరులేం కాదు. వారు చేసిందల్లా ఒకటే.. నచ్చిన మార్గంలో ప్రయాణించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం. మనం చదివిన విద్యా ధ్రువపత్రాలు కేవలం అర్హతగానే పరిగణించాలి. మార్కులు తక్కువ వచ్చాయని కుంగుబాటుకు గురవటం అనవసరం. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని తెలుసుకున్న రోజు ప్రపంచంలోను మన కన్నా గొప్పవారు ఉండరు.

– చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె.

క్లుప్తంగా

బైకు అదుపుతప్పి యువకుడి మృతి


మృతుడు చరణ్

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని శాంతి నగర్ తిరుపతి బ్రిడ్జి వద్ద చియ్యవరం పంచాయతీ నడింపల్లికి చెందిన యువకుడు చరణ్ (28) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. యువకుడు ద్విచక్రవాహనంలో వేగంగా వెళుతూ ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన కృష్ణప్ప

మదనపల్లె : కరెంట్ షాక్‌తో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం సాయంత్రం సత్యసాయి జిల్లా ఎన్.పి. కుంట మండలం బలిజ పల్లె పంచాయతీ సారగుండ్లపల్లెలో జరిగింది. స్థానికుడైన పెద్దరెడ్డప్ప కుమారుడు కృష్ణప్ప (40) తన పొలం వద్ద పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా తీవ్రమైన గాలులు వీచాయి. దీంతో మోటార్‌కు అమర్చిన తీగలు తెగిపోవడంతో, వాటిని సరిచేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఎన్ పి కుంట ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. సోమవారం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు.

పాఠశాల గుర్తింపు రద్దు

కడప ఎడ్యుకేషన్ : కమలాపురం పట్టణంలోని స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ 6 నుంచి 10వ తరగతులకు సంబంధించిన గుర్తింపును రద్దు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ తెలిపారు. తల్లిదండ్రులు ఈ పాఠశాల నుంచి తమ పిల్లల ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ తీసుకొని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చేర్పించుకోవాలని సూచించారు.

కన్ను పడితే కబ్జా చేయాల్సిందే.!


ఏటిలో ఇసుక గుండ్రాయితో ఏటి భూమిని చదును చేస్తున్న యంత్రాలు


రెడ్డివారిపల్లి బ్రిడ్జి వద్ద తొలగించిన చెట్లు

- రైల్వేకోడూరు నియోజకవర్గంలో కూటమి నేతల ఆక్రమణల పర్వం
- కోట్లు విలువ చేసే భూముల కబ్జాకు యత్నం
- నిద్రావస్థలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఇక్కడి ద్వితీయ శ్రేణి నాయకుల భూకబ్జాలకు అంతు లేకుండా పోతోంది. అగ్రనాయకుల అండదండలతో ఏటి, వంక, ప్రభుత్వ, ప్రైవేటు లిటిగేషన్ భూములను స్థానిక అధికారుతో కలిసి అడ్డదారిలో ఆక్రమించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నింటిని స్వాహాచేసి విక్రయించిన దాఖలాలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి నేతల కన్నుపడితే అది కబ్జా కావాల్సిందే అనే విధంగా పరిస్థితి తయారైంది. అధికారం చేపట్టినప్పటి నుంచి ధన, భూ కబ్జాలపైనే దృష్టి సారించారని పలువురు చర్చించుకుంటున్నారు. కూటమిలో వర్గపోరు ఉన్నప్పటికీ స్వాహా చేసే విషయంలో అన్ని వర్గాలు ఒక్కటవుతున్నాయి. రాఘవ రాజపురం సబ్‌స్టేషన్ వద్ద ఆర్‌అండ్‌బీ స్థలం, మైసూరావారిపల్లి ఈద్గా భూమి తంతంగం మరువక ముందే మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ పరిధిలో రెడ్డివారిపల్లి బ్రిడ్జి వద్ద గిరిజనుల ఇంటి స్థలాలు, ఏటి పొరంబోకు భూమిపై కొందరి కన్ను పడింది. గతంలో 1997 ఫిబ్రవరి నెలలో 573 సర్వే నంబర్‌లో దరిశా శేషయ్య కొంత భూమిని ఏటి పక్కన ఉండే 15 గిరిజన కుటుంబాలకు అగ్రిమెంటుపై విక్రయించారు. సుమారు 3 దశాబ్దాలుగా వారు గుడిసెలు వేసుకొని మామిడి చెట్లు నాటుకొని జీవనం సాగిస్తున్నారు. కొత్తగా రెడ్డివారిపల్లికి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండడంతో కొందరి కన్ను దీనిపై పడింది. నకిలీ అగ్రిమెంట్లు తయారు చేసుకుని అధికారులతో కుమ్మక్కై, ఎలాంటి నోటీసులు లేకుండా ఎవరూ లేనప్పుడు చెట్లను, గుడిసెలను తొలగించడమే కాక ఆనుకొని ఉన్న ఏటి పొరంబోకు భూమిని, అక్కడి నదిలోని ఇసుక గుండ్రాళ్లను జేసీబీలు, పొక్లెన్లతో ఎత్తులేపి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రంగం సిద్ధం చేస్తున్నారు.


గిరిజనులకు శేషయ్య రాసిచ్చిన అగ్రిమెంటు

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

తమ ఇరిగేషన్ శాఖ పరిధిలోని గుంజనేటిలో యంత్రాలతో ఇసుక గుండ్రాయి తరలిస్తూ అక్కడే ఉన్న ఇరిగేషన్ పరిధిలోని భూమిని ఎత్తు లేపుతుంటే అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయమై డీఈ వినోద్‌కుమార్‌ను వివరణ కోరగా తమ శాఖలో సిబ్బంది కొరత ఉందని, సర్వే జరిపి ఏటి భూమి ఉంటే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

రెవెన్యూ అధికారి ఏమంటున్నారంటే..

ఈ సంఘటనపై విచారణ జరపాలని వీఆర్‌ఓను ఆదేశించామని, అలాగే సమగ్రంగా సర్వే జరపాలని మండల సర్వేయర్‌ను ఆదేశిస్తామని తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తెలిపారు. ప్రభుత్వ భూమి ఉంటే తప్పని సరిగా చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్తకోడూరులో కూటమి నాయకుల పైరవీలు

పట్టణంలోని కొత్తకోడూరు ప్రాంతంలో చాలా మంది లబ్ధిదారులు ఇల్లు కట్టుకొని నివాసముంటున్నారు. అక్కడ చాలా వరకు కేటాయించని ఇంటి స్థలాలు ఉన్నాయి. అలాగే ఇళ్లు నిర్మించుకోని స్థలాలు ఉన్నాయి. వీటిలో సుమారు 200 వరకు ఇంటి స్థలాలు అధికారులతో కుమ్మక్కై కొందరు నాయకులు అమ్ముకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని భూ ఆక్రమణలు, దందాలపై ఇక్కడి అధికారుల ప్రమేయం లేకుండా జిల్లా స్థాయి అధికారులతో సమగ్ర విచారణ చేపడితే అసలు విషయాలు వెలుగు చూస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

కలికిరి : వాల్మీకిపురం మండల పరిధిలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కలికిరి చెందిన జ్ఞానేంద్రప్రసాద్(27)కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... కలికిరి పట్టణానికి చెందిన జ్ఞానేంద్రప్రసాద్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం మదనపల్లెలోని తన బంధువుల ఇంటి నుంచి కలికిరికి ద్విచక్రవాహనంలో వస్తుండగా మార్గ మధ్యంలో వాల్మీకిపురం మండల పరిధిలోని చింతలవారిపల్లి బస్టాప్ సమీపంలో ముందు వెళుతున్న బొలేరో వాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో యువకుడు రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వాల్మీకిపురం ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

భూమి కోసం ఘర్షణ

ముగ్గురికి రక్త గాయాలు


గాయపడిన గోపాలయ్య, క్రిష్ణవేణి, వంశీలను 108 వాహనంలో రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని ఎస్. రాజంపేట బీసీ కాలనీలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ముగ్గురికి రక్త గాయాలయ్యాయని ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎస్.రాజంపేట గ్రామం బీసీ కాలనీలో ఆదివారం భూ వివాదమై అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగిందన్నారు. తంగా క్రిష్ణయ్య, తంగా గోపాలయ్య అనే ఇరువురు అన్నదమ్ములకు పెద్దలు సంపాదించిన 6 ఎకరాల సాగుభూమి ఉంది. ఆదివారం రాత్రి తమ్ముడు గోపాలయ్య తన అన్న అయిన తంగా క్రిష్ణయ్య వద్దకు వెళ్లి ఈ భూమి భాగ పరిష్కారం చేయాలని అడిగాడు. ఇందుకు క్రిష్ణయ్య అంగీకరించలేదు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. గోపాలయ్యపై క్రిష్ణయ్య కర్రలతో దాడిచేశాడు. అడ్డు వచ్చిన గోపాలయ్య కూతురు క్రిష్ణవేణి, కొడుకు వంశీలపై కూడా దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన ముగ్గురిని స్థానికులు సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు 108 వాహనంలో తరలించారు. బాధితుడు గోపాలయ్య ఫిర్యాదు మేరకు తంగా క్రిష్ణయ్య, సాయి బాలక్రిష్ణ, గంగాదేవి, కళావతి, పెంచలమ్మ సహా 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ కనెక్షన్ తీసుకోవద్దన్నందుకు కొడవలితో దాడి


సంఘటన స్థలంలో ఇరువర్గాల పెనుగులాట


తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో రేపన లక్ష్మీదేవి, రేపన రామకృష్ణ


స్వల్ప గాయాలతో రేపన ప్రభాకర్

రాయచోటి టౌన్ : తమ విద్యుత్ మోటార్ నుంచి విద్యుత్ కనెక్షన్ తీసుకోరాదని వారించినందుకు రేపన లక్ష్మీదేవి, రేపన రామకృష్ణలపై రేపన ప్రభాకర్ అనే వ్యక్తి కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామం వడ్డెపల్లెకు చెందిన రేపన లక్ష్మీదేవి, రేపన రామకృష్ణలు బావ మరదళ్లు. వారి పొలం వద్ద అమర్చుకున్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్ల నుంచి రేపన ప్రభాకర్‌కు చెందిన విద్యుత్ మోటారుకు విద్యుత్ కనెక్షన్ అమర్చేందుకు వెళ్లాడు. అయితే వీరు తమ మోటారుకు విద్యుత్ సమస్య వస్తుందని వేరే చోటు నుంచి కనెక్షన్ తీసుకోవాలని చెప్పారు. అయితే అందుకు ప్రభాకర్ నిరాకరిస్తూ వారి మోటారు స్తంభం నుంచే విద్యుత్ కనెక్షన్ తీసుకుంటానని బెదిరించి కనెక్షన్ తీసుకొనే ప్రయత్నం చేశాడు. దీంతో ఇరువురి మధ్య గొడవ జరిగింది. తన మాట వినడం లేదని భావించిన రేపన ప్రభాకర్ కొడవలితో వారిద్దరిని ఊరిలో వెంటాడి నరికేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గ్రామస్తులు ఒక్కసారిగా అతన్ని పట్టుకొన్నారు. అప్పటికే లక్ష్మీదేవి, రామకృష్ణ తలకు, భుజంపైన, ఇతర భాగాలపై కొడవలితో గాయపరిచాడు. అయితే అతన్ని పట్టుకొనే క్రమంలో పెనుగులాట జరిగింది. ఈ క్రమంలో రేపన ప్రభాకర్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అంతా మా ఇష్టం.. మేము చెప్పినట్లే జరగాలి

- పులివెందుల టీడీపీలో వర్గపోరు
- బీటెక్ రవి, రాంగోపాల్ వర్గీయుల మధ్య విభేదాలు

సాక్షి టాస్క్ ఫోర్స్ : పులివెందుల నియోజకవర్గంలో కూటమి నేతల అరాచకాలకు అడ్డు లేకుండా పోయింది. అందులో ముఖ్యంగా బీటెక్ రవి అనుచరులకు మితిమీరి ప్రవర్తిస్తున్నారు. కాదేది మాకు అనర్హమంటూ విపరీతంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా తమ పార్టీకి చెందిన నేతలను సైతం భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాము చెప్పిందే వేదం తాము చేసేది న్యాయం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వీరికి పోలీసులు పూర్తి వత్తాసు పలుకుతున్నారు.

పనుల కోసం పంతాలు..

తాజాగా పులివెందుల నియోజకవర్గం వేముల మండలం వేల్పుల గ్రామం వద్ద ఆదివారం రాత్రి అధికార పార్టీ నాయకుల మధ్య గొడవ జరిగింది. విశ్వసనీయ సమాచారం మేరకు వేముల మండలం వేల్పుల గ్రామం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు జరుగుతున్నాయి. దానికి సంబంధించి మట్టిని అధికార పార్టీకి చెందిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల రాఘవరెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి సరఫరా చేస్తున్నాడు. ఈ మట్టిని కూడా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పెద్దజూటూరు గ్రామ పరిసరాలలో కొండ, గుట్టలను తవ్వి సరఫరా చేస్తున్నాడు. అయితే ఇక్కడే అధికార పార్టీ నాయకులకు లుకలుకలు మొదలయ్యాయి. కృష్ణారెడ్డి మట్టి సరఫరాను జీర్ణించుకోలేని బీటెక్ రవి వర్గం అంటే వేముల పార్థసారథి రెడ్డి వర్గమైన సుధాకర్ రెడ్డి ఈ పనులను అడ్డుకున్నారు. తమ ప్రాంతంలో మట్టి సరఫరా చేయడానికి మీరు ఎవరు అంటూ గట్టిగా వారిని నిలదీశారు. ఈ ప్రాంతంలో ఏమైనా మేమే చేయాలంటూ వారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం రాత్రి కృష్ణారెడ్డికి చెందిన మట్టి తరలించే వాహనాలను సుధాకర్ రెడ్డి వర్గం అడ్డుకుంది. దీంతో కృష్ణారెడ్డి సోదరుడైన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాఘవరెడ్డి అనుచరులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య కవింపు చర్యలు జరిగాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను శాంతింప చేసే ప్రయత్నాలు చేశారు. దీనిపై తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు బీటెక్ రవివర్గం చేస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని అధిష్టానానికి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం ముట్టివారిపల్లె పంచాయతీ కోనంగివారిపల్లెకు చెందిన ఆనంద కుమారుడు శ్రీనివాసులు (26) ఇంటి వద్ద పురుగుమందు తాగాడు. గ్రామంలో ఆనందకు ఇతరులతో ఉన్న భూ సమస్యల కారణంగా, పోలీస్ కేసు కావడం, తాజాగా ప్రత్యర్థులు కక్షపూరితంగా శ్రీనివాసులుపై మరోసారి కేసు పెట్టడంతో, పోలీసులు స్టేషన్ పిలిపించి విచారించారు. దీన్ని అవమానంగా భావించి మనస్థాపంతో శ్రీనివాసులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన అనిల్ రైల్వేకోడూరు ప్రాంతానికి చెందిన లక్ష్మిని ప్రేమ వివాహం చేసుకొని జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తూ కురబలకోట మండలం అంగళ్లులో ఉంటున్నాడు. సోమవారం భార్యాభర్తల మధ్య కుటుంబ సమస్యల కారణంగా గొడవ జరిగింది. దీంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన అనిల్ భార్యకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని నీవు స్వేచ్ఛగా ఉండొచ్చని ఫోన్లో చెప్పాడు. దీంతో, మనస్థాపం చెందిన లక్ష్మి(23) విష ద్రావణం తాగింది. గమనించిన స్థానికులు బాధితురాలిని వెంటనే మదనపల్లెప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆయా ఘటనలపై సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

దారి దోపిడీ కేసులో వ్యక్తి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితుడు

పెనగలూరు : మండలంలోని చక్రంపేట వద్ద రాత్రి వేళలో దారిదోపిడీ చేసిన కందుల బాలవర్దన్ నాయుడు అలియాస్ బాలు అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పెనగలూరు ఎస్‌ఐ రవి ప్రకాష్ రెడ్డి తెలిపారు. 2023 మార్చి 8వ తేదిన పెనగలూరు కొత్తపల్లి గ్రామానికి చెందిన నవీన్ కుమార్ అనే ఫొటోగ్రాఫర్ చిట్వేలిలో ఓ కార్యక్రమానికి హాజరై ద్విచక్ర వాహనంలో అర్ధరాత్రి వేళ ఇంటికి బయలుదేరాడు. చక్రంపేట సాయి వికాస్ స్కూల్ వద్ద టి.పెంచలయ్య అలియాస్ చిన్నతో కలిసి ఫొటోగ్రాఫర్ వాహనాన్ని ఆపి అతని వద్ద రూ. 5 వేలు తీసుకొని పరారయ్యాడు. వెంటనే బాధితుడు పెనగలూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. అప్పట్లో పెంచలయ్య అలియాస్ చిన్నను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. బాలవర్దన్ నాయుడు అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. అతను ఇటీవల పది రోజుల క్రితం చిట్వేలి పరిసర ప్రాంతాలలో తిరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అరెస్టు చేశారు.

మద్యం విక్రేతపై కేసు నమోదు

నిమ్మనపల్లె : అధిక ధరలకు విక్రయించేందుకు అక్రమంగా మద్యం కలిగిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని రెడ్డివారిపల్లెకు చెందిన తుమ్మల గోపాల్ మదనపల్లెలోని వివిధ మద్యం షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి గ్రామానికి తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో అతనిపై నిఘా ఉంచి ఆదివారం సాయంత్రం అరెస్టు చేశామన్నారు. అతను వద్ద నుంచి రూ.6482 విలువ కలిగిన 41 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి, రిమాండ్ కు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవికుమార్

లక్కిరెడ్డిపల్లి : గాలివీడు మండలం, నూలివీడు శ్రీనివాసపురానికి చెందిన ఏ.రవికుమార్ (45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు లక్కిరెడ్డిపల్లి ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. మంచాలపై వైరు అల్లుకుంటూ జీవనం సాగించే రవికుమార్ ఆదివారం రాత్రి తన పని ముగించుకొని లక్కిరెడ్డిపల్లి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా దొరిచెరువు వద్దకు రాగానే రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొని పక్కనే ఉన్న పొలాల్లో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సచివాలయానికి తాళం


సాలాబాదు సచివాలయానికి తాళాలు వేసిన దృశ్యం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని సాలాబాదు సచివాలయంలో సోమవారం సచివాలయ సిబ్బంది కరువయ్యారు. సోమవారం ఉదయం 9.45 గంటలకు హాజరు వేసిన సిబ్బంది సచివాలయానికి తాళాలు వేసి కనిపించకపోయే సరికి ప్రభుత్వ సేవలకు వచ్చిన ప్రజలు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో సాలాబాదు సచివాలయం సిబ్బంది మంగళవారం ఉదయం కడప కార్యాలయానికి రావాలని నోటీసులు జారీ చేసినట్లు ఒంటిమిట్ట ఎంపీడీఓ కుళాయి బాబు తెలిపారు.

ఉపాధి కూలీలను ఆదుకోవాలి

- పెండింగ్ బిల్లులను త్వరితగతిన చెల్లించి అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయండి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్



రాయచోటి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పెండింగ్ బిల్లులను త్వరితగతిన చెల్లించి కూలీలను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉపాధి హామీ బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న ఆలస్యం, చోటు చేసుకుంటున్న అవినీతి అక్రమాలపై ఆయన స్పందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పనులు కల్పించి, వలసలు నివారించాలన్న ఉద్దేశంతో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎన్నో అవినీతి, అక్రమాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నాలుగు మాసాలుగా కూలీలకు బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ కూలీ పనులు సక్రమంగా దొరక్కపోవడంతో ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు బిల్లులు చెల్లించకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంలో అధికారులు వివక్ష చూపుతున్నారని, జాబ్ కార్డులు తీసేస్తామని రాజకీయ కోణంలో అధికారులు మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. అవినీతి, అక్రమాలకు సహకరిస్తున్న అధికారులు రానున్న రోజుల్లో ఎక్కడున్నా తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. జరుగుతున్న ప్రతి పనిపై ఆరా తీస్తున్నామని, వీడియోలు ఇతర ఆధారాలతో సహా సేకరిస్తున్నామన్నారు. నాలుగేళ్ల తరువాత అవినీతి, అక్రమాలను ఆధారాలతో సహా నిరూపించి కచ్చితంగా రికవరీ చేయించి బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. కూలీలు చేయాల్సిన పనులను యంత్రాలతో చేస్తున్నారని, ఊర్లలో లేని వ్యక్తుల పేర్లను మస్టర్లలో నమోదు చేయడం, చేసిన పనులకే తిరిగి మెరుగులు దిద్ది, బెదిరించుకుని బిల్లులు చేయించుకుంటున్నారన్నారు. ఇందుకు సంబంధించి తమ వద్ద వీడియోలతో సహా ప్రాంతాల వారీగా, తేదీల వారీగా ఆధారాలు ఉన్నాయన్నారు. పథకంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని అధికారులకు శ్రీకాంత్‌రెడ్డి సూచించారు.

ఒంటరి జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన చెంగయ్య

మదనపల్లె : ఒంటరి జీవితం, ఆపై అనారోగ్యం, వృద్ధాప్యం, తదితర సమస్యలతో మనస్థాపం చెంది ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని కోటవీధిలో నివాసం ఉంటున్న గందోడి చెంగయ్య (76), భార్య లక్ష్మీదేవమ్మలకు ఒకే కుమార్తె అరుణ ఉండగా, ఆమెకు చాలా కాలం క్రితం గుర్రంకొండకు చెందిన మురళితో వివాహం జరిపించారు. 15 సంవత్సరాల క్రితం భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో కోట వీధిలోని ఇల్లు బాడుగకు ఇచ్చి లక్ష్మీదేవమ్మ పట్టణంలోని దేవత నగర్‌లో నివాసం ఉంటోంది. చెంగయ్య మదనపల్లె మండలం దుబ్బిగానిపల్లి పంచాయతీ ఎనుములవారిపల్లె సమీపంలోని వృద్ధాశ్రమంలో ఉంటున్నాడు. కుమార్తె అప్పుడప్పుడు వృద్ధాశ్రమానికి వెళ్లి అవసరమైన వస్తువులు అందించి పలకరించి వచ్చేది. ఇటీవల చెంగయ్య అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉండేవాడు. కుమార్తె తనను కలిసిన సందర్భంలో, అనారోగ్యం వేధిస్తోందని జీవితంపై ఆసక్తి లేదని నిర్లిప్తంగా మాట్లాడేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం స్థానికుడైన నాగరాజ పాలు పోసేందుకు వృద్ధాశ్రమానికి వెళ్లగా, చెంగయ్య తాను ఉంటున్న గదిలో ఫ్యానుకు పంచెతో ఉరి వేసుకుని వేలాడుతూ ఉండడాన్ని గమనించాడు. వెంటనే స్థానికులు, పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న తాలూకా ఎస్‌ఐ గాయత్రి ఆత్మహత్యకు గల కారణాలను స్థానికులను విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుమార్తె అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

మాయ మాటలతో బంగారం చోరీ

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు : పట్టణంలో ఎస్సీ కాలనీలో కరపాకుల సుజాత అనే మహిళకు మాయ మాటలు చెప్పి బంగారాన్ని చోరీ చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి పది తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం అర్బన్ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా సిరివెళ్ల గ్రామానికి చెందిన మురిర్నే కనకమ్మ, ఆమె భర్త శ్రీనివాసులు గత నెల 24వ తేదీన జమ్మలమడుగు ఎస్సీ కాలనీలో ఉన్న సుజాత ఇంటికి వెళ్లి అనారోగ్యం తొలగాలంటే ఇంట్లో పూజలు చేయాలని నమ్మించారు. సుజాత చేత ఆమె ఇంట్లో ఉన్న బంగారం లాంగ్‌చైన్, రెండు బంగారం కడియాలు, హారం మొత్తం 10 తులాల బంగారాన్ని పెట్టెలో బియ్యం పోసి అందులో పెట్టించారు. పూజలు చేసే సమయంలో పెట్టెలు మార్చేశారు. సాయంత్రం వరకు పెట్టెను తెరవద్దు అని చెప్పి వారు వెళ్లిపోయారు. సాయంత్రం సుజాత ఆమె భర్త చంద్రశేఖర్‌లు బియ్యం పెట్టెను తెరిచి చూశారు. అందులో బంగారం లేకపోవడంతో మోసపోయామని గ్రహించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ లింగప్ప ఆధ్వర్యంలో ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది దేవదాసు, రియాజ్ ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టి నిందితులను గుర్తించారు. వీరపునాయునిపల్లి, వేంపల్లి ప్రాంతాలలో కూడా ఇదే తరహాలో చోరీలు చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. ప్రస్తుతం వీరిని అరెస్టు చేసి వారి వద్దనుంచి పదితులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు.